క్లుప్తంగా

వృక్షశాస్త్ర విభాగాధిపతిగా సంధ్యాదీపిక



ఉత్తర్వులు స్వీకరిస్తున్న సంధ్యాదీపిక

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్ర విభాగాధిపతిగా ఆచార్య వి.సంధ్యాదీపిక పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు అందుకున్నారు. అనంతరం విభాగంలో బాధ్యతల్లో చేరారు. ఈ సందర్భంగా ఆచార్య సంధ్యా దీపికను విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

ఘనంగా కళాభారతి వ్యవస్థాపక దినోత్సవం



వర్ధమాన కళాకారులను సత్కరిస్తున్న కళాభారతి ట్రస్ట్ ప్రతినిధులు

మద్దిలపాలెం: కళాభారతి వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సూర్య భగవత్ శంకర శాస్త్రి పేరిట వ్యవస్థాపక దినోత్సవాన్ని వైభవంగా జరిపారు. తొలుత వర్ధమాన కళాకారులను ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. అనంతరం అన్నమయ్య, భక్తరామదాసు సంకీర్తనల చైతన్య సోదరులు వీనుల విందుగా ఆలాపించారు. ఈ కార్యక్రమంలో వీఎండీఏ చైర్మన్ ఎంఎస్ఎన్‌రాజు, ఏపీ బ్రహ్మణ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ చెరువు రామకోటయ్య, సుసర్ల రామగోపాల్ తదితరు లు పాల్గొన్నారు.


వారపు సంత కొనసాగించాలని ధర్నా



ధర్నా చేస్తున్న తోపుడు బళ్ల కార్మికులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీలో వారపు సంతను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ సోమవారం తోపుడు బళ్ల వ్యాపారులు ధర్నా నిర్వహించారు. ఇక్కడి సంతలో 200 మంది ఉపాధి పొందుతున్నామన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ కోశాధికారి వి.కృష్ణారావు మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్ సంత నిలిపివేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరావు, సింహాచలం, కె.కుమారి, బన్ని, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ఉత్సాహంగా 'చదువంటే మాకిష్టం'

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదువంటే మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ శాఖాధికారి రమణ విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించి, అందులోని నీతిని బోధించారు.



కేఆర్ఎం కాలనీలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న మొల్లి అప్పారావు

నిండు జీవితానికి.. రెండు చుక్కలు



పెదజాలరిపేటలో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రశాంతంగా పల్స్ పోలియో

ఆరిలోవ : పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం ఆరిలోవలో ప్రశాంతంగా జరిగింది. జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ యూనిట్ (ఎఫ్ఆర్‌యూ), బాలాజీనగర్, ఆరిలోవ కాలనీ, పైనాపిల్‌కాలనీ, ఆదర్శనగర్ ప్రాంతాల్లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోలియో చుక్కలు వేశారు. ఆయా కేంద్రాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమాన్ని ఆరిలోవ ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రిలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ప్రారంభించారు. అనంతరం అన్ని కేంద్రాల్లో యూపీహెచ్‌సీల వైద్యులు, వైద్య సిబ్బంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వారి తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో నివారణ చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌యూ వైద్యాధికారి డాక్టర్ అనిత, యూపీహెచ్‌సీల వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



అంబేడ్కర్ కాలనీలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

ఎంవీపీకాలనీలో..

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేటలో 3 చోట్ల శిబిరాలతో పాటు 17, 18 వార్డుల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయగా వేల మంది పిల్లలు పోలియో చుక్కలు వేయించుకున్నారు. 17వ వార్డులో జరిగిన శిబిరంలో కార్పొరేటర్ గేదెల లావణ్య, 18వ వార్డులో కార్పొరేటర్ మంగవేణి చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేశారు. ఆశా వర్కర్లు దుర్గా, విజయ, పార్వతీ తదితరులు పాల్గొన్నారు.

కేఆర్ఎం కాలనీలో..

మద్దిలపాలెం : మొదటి విడత పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం వాడవాడలా నిర్వహించారు. జీవీఎంసీ 16వ వార్డు కేఆర్ఎం కాలనీలో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అలాగే అంబేడ్కర్ కాలనీ, ఇసుకతోట, మద్దిలపాలెం, ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు.

10వ వార్డులో అభివృద్ధి పరుగులు

రూ. కోట్లాది నిధులతో సీసీ, బీటీ రోడ్లు, కాలువలు, యూపీహెచ్‌సీ, పార్కు నిర్మాణానికి ప్రణాళిక



ఇందిరాగాంధీనగర్‌లో నిర్మించిన తారు రోడ్డు



రాజీవ్‌నగర్‌లో నిర్మిస్తున్న కాలువలు



వివేకానందనగర్‌లో నిర్మించిన యూపీహెచ్‌సీ

ఆరిలోవ : తూర్పు నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ నియోజకవర్గంలో 15 వార్డులు ఉన్నాయి. వాటిలో 11 మంది వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఉండగా, ముగ్గురు టీడీపీ, ఒకరు జనసేన కార్పొరేటర్ ఉన్నారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఉన్న 9, 11, 12, 13, 15, 16, 17, 20, 21, 23, 28 వార్డులతో పాటు టీడీపీ కార్పొరేటర్లు ఉన్న 10, 18, 19 వార్డులు, జనసేన కార్పొరేటర్ ఉన్న 22వ వార్డులో కూడా సమానంగా జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఎలాంటి పక్షపాత ధోరణి లేకుండా టీడీపీ, జనసేన వార్డుల్లో సైతం మిగిలిన వార్డులతో సమానంగా అభివృద్ధి చేస్తున్నారు. దీనికి పదో వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులే నిదర్శనం.

10వ వార్డులో రూ. 6.71 కోట్లతో అభివృద్ధి..

జీవీఎంసీ 10వ వార్డులో 2020 నుంచి ఇంత వరకు జీవీఎంసీ అధికారులు రూ.కోట్ల నిధులు ఖర్చు చేసి అభివృద్ధి ప్రణాళిక వేశారు. వార్డులో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కాలువలు, యూపీహెచ్‌సీ, పార్కు తదితర అభివృద్ధి పనులు జరిపించడానికి రూ 6.71 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశారు. వాటిలో ఇప్పటికే రూ 2.17 కోట్లతో ఎస్ఐజీ నగర్, సుందర్‌నగర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు నిర్మించారు. మరో రూ.కోటి నిధులతో వివేకానందనగర్‌లో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ) నిర్మించి వార్డు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. మరో రూ 1.47 కోట్లతో ఇందిరాగాంధీనగర్, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల్లో కాలువలు, తారు రోడ్డు, సీసీ రోడ్డు నిర్మాణం, గాంధీనగర్‌లో జీవీఎంసీ కల్యాణ మండపానికి అదనంగా మొదటి అంతస్తు నిర్మాణం జరుగుతున్నాయి. వీటితో పాటు రూ. 2.07 కోట్లతో మరికొన్ని కాలనీల్లో రోడ్లు, కాలువల నిర్మాణంతో పాటు ఆదర్శనగర్ కొండవాలులో రక్షణ గోడ నిర్మాణం, మెట్ల మార్గం, రవీంద్రనగర్‌లో సీసీ కాలువల నిర్మాణం తదితర అభివృద్ధి పనుల కోసం జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు టెండర్లు పిలిచారు. ప్రస్తుతం ఇందిరాగాంధీనగర్, రాజీవ్‌నగర్లలో తారు రోడ్లు, సీసీ రోడ్లు, సీసీ కాలువ పనులు జరుగుతున్నాయి. దీంతో వార్డులో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వార్డులో టీడీపీ కార్పొరేటర్‌ను గెలిపించినప్పటికీ పక్షపాతం చూపకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేస్తున్నారని అంటున్నారు.

ఉత్సాహంగా ఓర్జా ఫెస్ట్



ఓర్జా ఫెస్ట్‌లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

బీచ్‌రోడ్డు : ఓర్జా పేరుతో బీచ్‌రోడ్డులోని ఒక హోటల్లో ఆదివారం నిర్వహించిన ఫెస్ట్ ఉత్సాహభరితంగా సాగింది. డ్యాన్స్‌లు, పాటలు, ఉత్తేజపరిచే మాటలతో ఫెస్ట్ హోరెత్తింది. టెక్ విసన్ సాఫ్ట్‌వేర్ సంస్థ 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ ఫెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డులు బహూకరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో సాఫ్ట్‌వేర్ సంస్థలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని హామీ ఇచ్చారు. పరిపాలన రాజధాని కాబోతున్న విశాఖలో కంపెనీలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫణీంద్ర శర్మ, గీతా సౌజన్య, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

బీచ్‌రోడ్డు : రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించటమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం జీవీఎంసీ 28వ వార్డులోని న్యూ పితాని వీధి, దమ్ము వారి వీధి, బంగారమ్మ ఆలయం ప్రాంతాల్లో 54వ రోజు పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో గడప గడపకి ఎన్నో సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మరల ఆయనే రాష్ట్రానికి సీఎం కావాలని, అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దారి పొడవునా మహిళలు ఆయనకు హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, పార్టీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

డాక్టర్ జి.ఎన్. రావుకు పురస్కారం పట్ల హర్షం

ఆరిలోవ : ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వ్యవస్థాపకుడు డాక్టర్ జి.ఎన్. రావును వరల్డ్ ఐకాన్ 21 పురస్కారం వరించింది. దీంతో విశాఖపట్నం హనుమంత వాకలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. ఇటీవల ఇండోనేషియాలోని బాలి నగరంలో 39వ ఆసియా పసిఫిక్ అకాడమీ ఆఫ్ ఆప్తమాలజీ (ఏపీఏఓ) సదస్సు జరిగినట్లు ఎల్వీపీ ఆస్పత్రి వైద్యులు ఆదివారం తెలిపారు. ఈ సదస్సులో అత్యంత ప్రతిభావంతులైన 23 మంది నేత్ర వైద నిపుణులను ఎంపిక చేసి 'వరల్డ్ ఐకాస్ 21' అవార్డుతో సత్కరించినట్లు తెలిపారు. వారిలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యాశాల వ్యవస్థాపకుడు డాక్టర్ జి.ఎన్. రావు పదో స్థానంలో నిలిచారన్నారు. 21వ శతాబ్దంలో నేత్ర సంరక్షణ రంగంలో ఆయన కనబరిచిన విశేష కృషికి ఈ అవార్డు వరించిందని వైద్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పురస్కారం పొందిన డాక్టర్ జి.ఎన్. రావు మొట్టమొదటి భారతీయుడని తెలిపారు.

గొల్ల బాబూరావుకు సత్కారం



సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

ఎంవీపీకాలనీ : రాజ్యసభ సభ్యుడిగా ఎంపికై బాధ్యతలు చేపట్టబోతున్న పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావును ఓం యోగ సెంటర్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఆయన ఓం యోగా సెంటర్‌లో సభ్యుడు కావడంతో సెంటర్ సభ్యులంతా సీతమ్మధారలో ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ బాబూరావు మాట్లాడుతూ రాజకీయాల్లో నిబద్ధతతో కూడిన సేవల ఫలితంగా ఈ అవకాశం దక్కిందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓం యోగ సెంటర్ వ్యవస్థాపకుడు చిలకా రమేష్, అధ్యక్షుడు శాంతారాం, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మధుసూదన్‌రావు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు పరికరాల పంపిణీకి రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వయోవృద్ధులతో మాట్లాడుతున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వం ఆలిమ్‌కో సంస్థ ద్వారా ప్రవేశపెట్టిన వయోశ్రీ యోజన పథకంలో వయోవృద్ధులకు పలు పరికరాల పంపిణీ కోసం ఆదివారం కైలాసపురం డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ నమోదు కార్యక్రమాన్ని ముఖ్య అతిథి రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ప్రారంభించి మాట్లాడారు. వయోశ్రీ పథకం ద్వారా రూ.12 వేల విలులైన ఉపకరణాలను లబ్ధిదారులకు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. 60 ఏళ్ల నిండి, తెల్లరేషన్ కార్డు కలిగిన దివ్యాంగ వృద్ధులకు కళ్లజోళ్లు, వీల్‌చెయిర్‌లు, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు, మోకాళ్ల బెల్టులు, నడుము బెల్టులు, మరిన్ని ఉపకరణాలను అందిస్తారన్నారు. అర్హులందరూ నమోదు చేయించుకోవాలని కోరారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ వివిధ లోపాలు గల వయోవృద్ధులకు ఇది ఒక మహత్తర కార్యక్రమమని ప్రశంసించారు. 2017లో ప్రారంభించిన ఈ పథకం జీవీఎల్ సహకారంతో తిరిగి ప్రారంభమైందని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. కార్యక్రమంలో వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి జె.మాధవి, కార్యక్రమ కో ఆర్డినేటర్ రూపాకుల రవికుమార్, ఆలిమ్‌కో ప్రతినిధులు అంకిత్, సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో శ్రీ సూర్యనారాయణమూర్తి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

అల్లిపురం : వెంకటేశ్వరమెట్టపై అలమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణ మూర్తి దేవాలయంలో మాఘ మాసం నాల్గవ ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు గోక్షీరంతో అభిషేకం, పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం మందార, చామంతి, గులాబీ పుష్పాలతో స్వామి వారిని విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించి ప్రసాదాలు అందజేశారు.

ఆఖరివారం ప్రత్యేక పూజలు..

మాఘ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా 10వ తేదీన మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు పాణంగిపల్లి కేశవాచార్యులు తెలిపారు. ఆ రోజు భక్తుల గోత్రనామాలతో విశేష అర్చనలు చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తరించాలని కోరారు.

ముగ్గురిని కాపాడిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్



బర్మాకాలనీకి చెందిన వృద్ధురాలిని రక్షించిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్

దాబాగార్డెన్స్: ఆర్.కె.బీచ్, రుషికొండ బీచ్‌ల్లో ముగ్గురిని జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ రక్షించి ప్రాణాలు కాపాడారు. విశాఖ బర్మాకాలనీకి చెందిన 60 ఏళ్ల నక్కా లక్ష్మమ్మ అనారోగ్యం కారణంగా మనస్తాపంతో ఆర్.కె.బీచ్‌లో దిగి శనివారం ఆత్మహత్యకు యత్నించింది. ఇది గమనించిన లైఫ్‌గార్డ్స్ ఆమెను రక్షించారు. రుషికొండ బీచ్‌లో శనివారం సముద్రంలో చిక్కుకున్న ఇద్దరు పర్యాటకులను లైఫ్‌గార్డ్స్ జె.హరీష్, ఎం.నవీన్, టి.పోలిరాజు, ఓ.రాజు, జి.చిన్న, అప్పన్న, కె.రాజు రక్షించి ప్రాణాలు కాపాడారు. ముగ్గురి ప్రాణాలు కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అభినందించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

తగరపువలస : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక, విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భీమిలి మండలం తాళ్లవలసలో ఇంటింటా ప్రచారం చేశారు. భగవద్గీతతో పాటు త్రైత సిద్ధాంత అనుబంధ గ్రంథాలు, శివరాత్రి ఆవశ్యకతను వివరించారు. జాగరణ ఉద్దేశ్యం తెలియజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కనకల త్రినాథరావు, వి.సురేష్, ఎస్.శ్రీనివాస్, బి.పైడన్న, కె.రాజు, కె.సంతోష్, కె.బంగారుతల్లి తదితరులు పాల్గొన్నారు.

140 ఎపిసోడ్‌లతో 'ఘంటసాల గాన మాధుర్యం'

దాబాగార్డెన్స్ : ఘంటసాల గ్లోబల్ ప్రాజెక్టు వ్యవస్థాపకుడు డాక్టర్ టి.శరత్‌చంద్ర సారథ్యంలో ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐడల్ గంధర్వ పేరిట గాయనీగాయకుల ఎంపిక నిర్వహించారు. కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, అమెరికాకు చెందిన జి.రాము, ఎన్నారై కె.సుధారాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 10 ఏళ్ల నుంచి 90 ఏళ్ల వయసు గల ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన గాయనీగాయకులు పాల్గొని పాటలు పాడారు. వీరిలో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. త్వరలో ఘంటసాల గాన మాధుర్యాన్ని కీర్తిస్తూ ప్రసారమాధ్యమాల ద్వారా 140 ఎపిసోడ్‌లతో ప్రేక్షకుల చెంతకు ఈ కార్యక్రమం చేరుతుందని డాక్టర్ శరత్ చంద్ర ఈ సందర్భంగా తెలిపారు. వి.రాజేంద్రప్రసాద్, జీవీఎంసీ సెక్రటరీ పి.నల్లనయ్య, సుబ్రహ్మణ్య శర్మ, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, జె.పృథ్వీరాజ్, మెలోడి సత్యనారాయణ, కందర్ప రాధ, నిర్వాహకులు పాల్గొన్నారు.


నేడు ఐడల్ గంధర్వ లోగో ఆవిష్కరణ

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు ఉత్తరాంధ్ర ఘంటసాల స్మారకపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ టి.శరత్ చంద్ర నేతృత్వంలో ఐడల్ గంధర్వ లోగోను సినీ నటుడు సుమన్ ఆవిష్కరించనున్నారు. అనంతరం స్వరాభిషేకం, పాడుతా తీయగా గాయనీగాయకులతో సినీ సంగీత విభావరి, శివారెడ్డి మిమిక్రీ నిర్వహించనున్నారు.

పాదయాత్రకు సంఘీభావం

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు సాగిన మహా పాదయాత్రకు భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఆదివారం మహా పాదయాత్ర జాతీయ రహదారి పక్కనున్న భెల్ ప్రవేశ గేటు వద్దకు రాగానే కార్మికులపై భెల్ కార్మిక సంఘ నాయకులు పూలు జల్లారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, సిటు ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్, ఎస్.జగన్నాథరావు, సీతంనాయుడు, కె.విజయ్‌కుమార్, ఎస్.రామారావు, మురళీశ్వరరావు, కె.నారపురెడ్డి, ఆర్.జనార్దనరావు, కె.కేశ్య తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శనలో చీరలు పరిశీలిస్తున్న మహిళ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలో సాయిదుర్గా హ్యాండ్ లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం చేనేత వస్త్ర, హస్తకళ ప్రదర్శన ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సెక్టార్-5లోని గిరిజనభవన్‌లో ఈ నెల 22 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రవేశం ఉంటుందన్నారు. ఏపీతో పాటు పశ్చిమబెంగాల్, కర్నాటక, రాజస్థాన్ న్యూఢిల్లీ తదితర రాష్ట్రాలకు చెందిన చేనేత ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తున్నట్లు తెలిపారు. పోచంపల్లి, నారాయణ్‌పేట్, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, బెంగాల్ సిల్క్, బాంధిని సిల్క్, భాగల్‌పూర్ సిల్క్ చీరలు, చేనేత వస్త్రాలతో పాటు కాటన్ టవల్స్, బెడ్‌షీట్స్, డోర్ కర్టన్స్, మ్యాట్స్‌ను, హస్తకళతో కూడిన గృహోపకరణాలను, ఫ్యాన్సీ ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. 30 వరకు స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వినికిడి సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



కిమ్స్ ఐకాన్‌లో వినికిడి పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయిబలరామకృష్ణ

అక్కిరెడ్డిపాలెం: అంతర్జాతీయ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో వినికిడి పరీక్షలు నిర్వహించారు. ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ సాయిబాలరామకృష్ణ 40 నుంచి 50 మందికి ఉచిత వినికిడి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరికి వినికిడి సామర్థ్యం పుట్టుకతోనే ఉండదని, అలాంటి వారిని వదిలేయకుండా కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స చేయిస్తే చక్కగా వినగలగడమే కాకుండా మాట్లాడే అవకాశం వస్తుందన్నారు. వినికిడి సమస్యలను నిర్లక్ష్యం చేయడం ద్వారా చిన్నారులు వినలేకపోవడం, మాటలు రాకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. శిశువు జన్మించిన వెంటనే వినికిడి పరీక్షలు చేయడం ద్వారా సమస్యలు ముందుగానే గుర్తించవచ్చని చెప్పారు.